క్లుప్తంగా

వేలంలో రూ.89 వేల ఆదాయం

పుంగనూరు: ప్రభుత్వాస్పత్రిలో పాతవస్తువులకు నిర్వహించిన ఈవేలంలో రూ.89 వేల ఆదాయం వచ్చినట్లు మెడికల్ ఆఫీసర్ జశ్వంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వేలం ద్వారా వచ్చిన నగదును ప్రభుత్వ ఖజానాలో జమ చేశామన్నారు. ఆస్పత్రికి అవసరమైన వస్తువులను కమిటీతో చర్చించి కొనుగోలు చేస్తామని తెలిపారు.

వైభవంగా శ్రీసల్లాపురెమ్మ జాతర


విశేష అలంకరణలో అమ్మవారు

బైరెడ్డిపల్లి: స్థానిక ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీసల్లాపురెమ్మ ఆలయ జాతరలో భాగంగా శుక్రవారం పుష్పపల్లకి, పూలగెరిగ మెరవణి నిర్వహించారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన పల్లకిపై అమ్మవారి శిరస్సును కొలువుదీర్చి బాణసంచా పేల్చుతూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తుడు బాలాజీ తలపై పూలగెరిగతో నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నాడు.

జిల్లా ఖజానా అధికారికి సన్మానం


రామచంద్రను సన్మానిస్తున్న ఏపీఎన్జీజీఓ నేతలు

పలమనేరు: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో జిల్లా ఖజానా అధికారి రామచంద్రను ఏపీఎస్ జీఓ సంఘం నేతలు, విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఈకేవైసీని తప్పనిసరిగా చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆస్పత్రి నుంచి బస్టాండ్‌కు వెళ్లిన కొద్ది సేపటికే..

- గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతుడు రామచంద్ర నాయుడు


చౌడేపల్లి: తిరుపతిలో వైద్యం చేయించుకుని ఇంటికి వెళ్లేందుకు బస్సు దిగి బస్టాండ్‌లో అడుగు పెట్టిన కొద్ది సేపటికే గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం చౌడేపల్లె బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఏ.కొత్తకోటకు చెందిన రామచంద్ర నాయుడు(59) వారం క్రితం అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడడంతో వైద్యులు రోగిను డిశ్చార్జ్ చేశారు. బస్సులో తిరుపతి నుంచి చౌడేపల్లెకు ప్రయాణం చేసిన రామచంద్రనాయుడు బస్సు దిగి బస్టాండ్‌లోకి రాగానే ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంట ఉన్న కుటుంబీకులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా గుండెపోటుకు గురై మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పిల్లలున్నారు. అతని కుటుంబాన్ని ప్రభుత్వాస్పత్రిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరామర్శించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన యాత్ర


పలమనేరుకు చేరుకున్న రాజు సైకిల్ యాత్ర

పలమనేరు: నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలానికి చెందిన రాజు ప్రభుత్వ పథకాలపై రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల ప్రజలకు అవగాహన కల్పించేలా సైకిల్‌యాత్ర చేస్తున్నాడు. ఇందులో భాగంగా శుక్రవారం పలమనేరుకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం కేవలం వైఎస్సార్‌సీపీనేనని తెలిపారు.

ఈ మహిళ ఎవరో తెలుసా?


స్పృహ తప్పి పడిపోయిన మహిళ

యాదమరి: గుర్తు తెలియని మహిళ అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కమ్మరాయని మిట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుమన్ కథనం మేరకు చిత్తూరు వైపు నుంచి 40 ఏళ్ల మహిళ నడుచుకుంటూ యాదమరి వైపు బయల్దేరింది. శుక్రవారం ఉదయం కమ్మరాయని మిట్ట వద్ద కళ్లుతిరిగి పడిపోయింది. స్థానికులు గుర్తించి, ఆమెను వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కానీ ఇప్పటివరకు ఆ మహిళ మాట్లాడడం లేదు. ఆ మహిళను ఎవరైనా గుర్తుపడితే 9440900684ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం


కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్సీ, పార్టీ నాయకులు


సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను లబ్ధిదారురాలికి ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక రామ్‌నగర్, పోస్టాఫీసు వీధి, దిగువవీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, సమస్యలు తెలుసుకుని పరిష్కరించాడానికే తాము గడప గడపకు వస్తున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్సీ దృష్టికి సమస్యలు

సీసీ రోడ్లు వేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం అనుమతులు కావాలని ప్రజలు కోరారు. సుమారు రూ.2 కోట్లతో రామకుప్పంలో సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. రామకుప్పంలో జగనన్న లేవుట్‌లో త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ మురళి, పార్టీ కో– కన్వీనర్ చంద్రారెడ్డి, అప్పి, ప్రసాద్, అబ్దుల్, శంకర్, గోపికృష్ణ, అజ్మల్‌బాషా, గయాజ్ ఉద్దీన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

రామకుప్పం: రామకుప్పం సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం చిత్తూరు కలెక్టర్ షన్మోహన్‌ను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ నేతృత్వంలో మండల వైఎస్సార్ సీపీ నేతలు కోరారు. ప్రధానంగా రామకుప్పంలో సిమెంట్ రోడ్లకు నిధులు, షాదీమహల్ పునః నిర్మాణం, రాజుపేటలో భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో గాండ్ల కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని రామకుప్పం తహసీల్దార్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ఇతర సమస్యలను సంబంధిత అధికారులకు బదలాయించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీతోపాటు బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, మురళీకృష్ణ, అప్పి, అబ్దుల్, నారాయణస్వామి, మురుగేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి జీర్ణోద్ధరణ పూజలు


మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నేతలు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపుర కలశ మహా సంప్రోక్షణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. పుంగనూరు జమీందార్లు ఇమ్మడి చిక్కరాయుల కాలంలో నిర్మించిన పురాతన ఆలయాన్ని సుమారు రూ.1.50 కోట్లతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో నిధులను వెచ్చించి ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ నెల 20న గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, కలశ ఊరేగింపు, తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. 21వ తేదీ పుణ్యాహవాచనం, గోపూజ, రక్షా బంధనం, పంచగవ్య, కలశరాధన, అగ్ని ప్రతిష్టాపన, గణపతి హోమం, రుద్రహోమం, దేవి హోమం, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేపట్టనున్నారు. 22న కలశరాధన, విశేష హోమ పూజలు, జయాధి హోమం, పూర్ణాహుతి, కుంభ విసర్జన, విమాన గోపురం కలశ సంప్రోక్షణ, కుంభాభిషేకం, పంచామృత రుద్రాభిషేకం, ఆచార్య పూజ, మహా మంగళ హారతి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.


మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం

మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం

శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న జీర్ణోద్ధరణ, విమాన గోపుర కలశ మహా సంప్రోక్షణ మహోత్సవానికి హాజరుకావాలని చౌడేపల్లె వైఎస్సార్‌సీపీ నేతలు, అర్చకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులను ఆహ్వానించారు. శుక్రవారం తిరుపతిలోని మంత్రి స్వగృహంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎంపీపీ రామమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, సర్పంచ్ వరుణ్‌భరత్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, నేతలు రమేష్ స్వామి, రాధాకృష్ణ, నాగరాజ ఉన్నారు.

బాధితులకు పరామర్శ


దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పంరూరల్: గాలివాన బీభత్సానికి ఇండ్లు కూలిపోయిన బాధితులను మున్సిపల్ చైర్మన్ సుధీర్ శుక్రవారం పరామర్శించారు. 8వ వార్డులోని పలార్లపల్లెలో చెట్టు ఇంటిపై పడి గూడు కోల్పోయిన మురుగేష్ కుటుంబంతో పాటు పాక్షికంగా దెబ్బతిన్న మరో కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని తెలిపారు. మురుగేష్‌కు తక్షణ సాయం కింద రూ. 5 వేల సొంత నగదు ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు గణపతి, కుమరేష్, రాము ఉన్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి

పలమనేరు: నేటి సమాజం పుచ్చలపల్లి సుందరయ్య మార్గంలో పయణించాలని సీపీఎం నేత గిరిధర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేసిన మహనీయున్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

వినాయకుని సేవలో శైలజాచరణ్ రెడ్డి


స్వామివారి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమశాఖ రాయలసీమ రీజినల్ చైర్ పర్సన్ శైలజాచరణ్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమె తన జన్మదినం సందర్భంగా దంపతులిద్దరూ స్వామి వారి దర్శనార్థంగా విచ్చేయగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రోగులు మెచ్చేలా సేవలు అందించాలి


ప్రభుత్వాస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న డీసీహెచ్ఎస్ నాయక్

పుంగనూరు: ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఉత్తమ సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డీసీకే.నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించారు. మందుల వివరాలు, ఓపీ వివరాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, తదితర సౌకర్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువగా గ్రామీణ ప్రాంత వాసులేనని.. వారికి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఎవరూ అసంతృప్తిగా వెళ్లకుండా ఉండేలా చూడాల్సిన బాధ్యత డాక్టర్లు, సిబ్బందిపై ఉందన్నారు. ఈయన వెంట మెడికల్ ఆఫీసర్ జశ్వంత్ ఉన్నారు.

18 రకాల వంటకాలతో అన్నదానం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కుప్పం: తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. మహిళలు, భక్తులు భారీగా దేవస్థానానికి తరలివచ్చి అమ్మవారికి మెక్కలు చెల్లించుకున్నారు. ఆలయం ఎదుట చలువ పందళ్ల కింద అన్నదానం చేశారు. కుప్పం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరుకు 18 రకాల వంటకాలతో సంతృప్తికర భోజనాలను వడ్డించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతరను పురస్కరించుకుని గురువారం రాత్రి శ్రీదేవి డ్రామా కంపెనీ డ్యాన్సర్లతో ఏర్పాటు చేసిన డ్యాన్సు ప్రోగ్రాం చూపరులను ఆకట్టుకుంది. నెల్లూరు నుంచి వచ్చిన కళాకారులు చేసిన డ్యాన్సు, కామెడీ సభికులను అలరించింది. శుక్రవారం పల్సర్ బైక్ రమణ బృందంచే చేపట్టిన పాటకచ్చేరి, నృత్య కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అమ్మవారి ఉత్సవ ఊరేగింపు జరిగింది. కార్యక్రమాల్లో రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, చైర్మన్ మంజునాథ్ పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్


అలరించిన నృత్య ప్రదర్శన

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని పలువురికి ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయ నిధి చెక్కులను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. మొత్తం ఏడుగురికి రూ.5.90 లక్షలు మంజూరయ్యాయి. మేకలవారిపల్లెకు చెందిన తులసి రూ.1.30 లక్షలు, రొంపిచెర్లకు చెందిన వసీం అక్రం రూ.1.70 లక్షలు, బొమ్మయ్యగారిపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి రూ.65 వేలు, లోకవారిల్లెకు చెందిన భాగ్యమ్మకు రూ.40 వేలు, గాలేటి వీధికి చెందిన మహబుబ్‌బాషాకు రూ.70 వేలు, బండకిందపల్లెకు చెందిన జెతున్‌బీకు రూ.40 వేలు, ఫజులుపేటకు చెందిన అబ్దుల్ నూర్‌కు రూ.75 వేలు మంజూరు అయ్యాయని తెలిపారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, కోటా వెంకటరమణ, సూర్య నారాయణ రెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: స్పందనలో ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ యువరాజు అన్నారు. స్పందన కార్యక్రమంలో సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. శుక్రవారం స్త్రీశక్తి భవన్‌లో విలేజ్ సర్వేయర్లు, విల్లేజ్ రెవెన్యూ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలని ధ్యేయంగా పెట్టుకున్నారని.. రెవెన్యూ సిబ్బంది ఎలాంటి అవినీతికి తావివ్వకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి రోజూ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన యూనిఫాంను ధరించి కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. తహసీల్దార్ మురళి, డీటీ బాలాజీ, ఆర్‌ఐ మోహన్‌రెడ్డి, సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించాలని వినతి


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వి.కోట: మండలంలోని ఓగు పంచాయతీ దేవరాజుపురం, ఓగుకు సంబంధించి రైతుల పొలాలకు వెళ్లే భూమిని కొందరు అక్రమించుకుని దారి లేకుండా చేశారని ఓగు, దేవరాజుపురం గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట నిలబడి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రభుత్వ రికార్డుల ప్రకారం దశాబ్దాల కాలంగా పంట పొలాలకు, బసవేశ్వర స్వామి ఆలయ భూములకు వెళ్లడానికి అక్కడి రైతులు ఒకరికొకరు సహకరించు కుంటూ బండి బాటను సిద్ధం చేసుకుని వెళ్లేవారని తెలిపారు. అయితే ఆ భూమిని ఓగు గ్రామానికి చెందిన లేట్ సుబ్బన్న భార్య చౌడమ్మ, కుమారుడు రాజప్ప కలిసి ఆక్రమించుకుని అడ్డుకుటుంటున్నట్లు తెలిపారు. గతంలోనూ ఈ సమస్యపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

ఉత్తమ వలంటీర్లకు పురస్కారం

పుంగనూరు: ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు ప్రభుత్వం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపిక చేసింది. వజ్రా అవార్డుకు రూ.30 వేలు, రత్న అవార్డుకు రూ.20 వేలు, మిత్రకు రూ.10 వేలు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో ఇద్దరు సేవా వజ్రకు ఎంపికై నట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. తేరువీధికి చెందిన అంజాద్‌అలీషేక్, కొత్తయిండ్లకు చెందిన వన్యలను వజ్రా అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే సేవారత్న అవార్డులకు కొత్తయిండ్లు–2 సచివాలయానికి చెందిన శశికళ, గోకుల్‌వీధికి చెందిన రిజ్వానబేగం, తూర్పుమొగశాల–2కు చెందిన మౌనిక, బీడీకాలనీకి చెందిన రఫీ, భగత్‌సింగ్‌కాలనీకి చెందిన చిరంజీవి ఎంపికయ్యారని వెల్లడించారు. మండలంలో సేవా రత్న అవార్డులు 5 మందికి లభించింది. వీరిలో రాగానిపల్లెకి చెందిన ఆనంద, సింగిరిగుంటకు చెందిన గీత, చదళ్లకు చెందిన హేమలత, చంద్రమాకులపల్లెకి చెందిన మణికుమారి, వనమలదిన్నెకి చెందిన శ్రీమతి ఉన్నారు. వీరిని పలువురు అభినందించారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు



నిరసనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సదుం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని ఎంపీపీ ఎల్లప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి అన్నారు. సెంటు స్థలం సమాధి కట్టడానికి సరిపోతుందని ఆయన వ్యాఖ్యానించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు సదుంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. పేదలను చులకనగా చూడడం తగదని హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీని మహాయజ్ఞంగా భావించి, ఇళ్లు లేని నిరుపేదలకు గృహాలను నిర్మించేలా కృషి చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు తన హయాంలో ఒక్క పేదవానికైనా ఇంటిస్థలం ఇచ్చారా.. అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి, చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, సర్పంచ్‌లు ఉషారాణి, మనోహర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు ధనశేఖర్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, నాగభూషణంరెడ్డి, ఖాజాపీర్, సయ్యద్‌బాషా, సీతాపతి, వాసు పాల్గొన్నారు.

29 నుంచి వేసవి యోగా శిక్షణ శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 17వ తేదీ వరకు వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. 12 ఏళ్లు దాటిన వారు అర్హులని, 20 రోజుల శిక్షణకు రూ.200 ఫీజు చెల్లించాలని వర్సిటీ అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 9247210327, 9110503203లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం రేపు


సమావేశంలో మాట్లాడుతున్న సంఘు సభ్యులు

చిత్తూరు రూరల్: తిరుపతి మహతి ఆడిటోరియంలో వీరబ్రహ్మేందస్వామి గోవింద మాంబల కల్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు చిత్తూరు స్వర్ణకార సంఘు, విశ్వబ్రహ్మణ సంఘు సభ్యులు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 7 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. పతాకావిష్కరణ, హోమం, కలశాభిషేక పూజలు జరుగుతాయన్నారు. 12 గంటలకు తిరుకల్యాణం, 4 గంటలకు ఉపన్యాసం ప్రారంభమవుతుందన్నారు. భక్తులందరూ పాల్గొన్ని ఈ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్ ఆచ్చారి, శీతాపతి, శివకుమార్, రవి, సురేష్, విజయ, శరవణ తదితరులు పాల్గొన్నారు.